బాబోయ్.. గ్రామ సింహాలు

గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వీధుల్లో ఆడుకునే చిన్నారులపై, ద్విచక్ర వాహనాల్లో వెళ్తున్న వారిపై దాడి చేసి విచక్షణారహితంగా కరుస్తున్నాయి. ప్రజలు వీధి కుక్కల బారిన పడి గాయాలపాలవుతున్న ఘటనలు ప్రతిరోజూ నమోదవుతున్నాయి. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

- బెంబేలెత్తిస్తున్న వీధి కుక్కలు
- వెంబడించి దాడి చేస్తున్న వైనం
- చోద్యం చూస్తున్న అధికారులు


పొదలకూరు వీధుల్లో స్వైరవిహారం చేస్తున్న శునకాలు


కొడవలూరులో మెయిన్ రోడ్డుపై సమూహంగా తిరుగుతున్న వీధి కుక్కలు

పొదలకూరు/ కోవూరు : కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో గత కొన్ని రోజులుగా వీధికుక్కల దాడులు పెరిగిపోతున్నాయి. గతంలో పందులు వీధుల్లో స్వైరవిహారం చేసేవి. ఏమైందో కాని పందులు కనుమరుగయ్యాయి. ప్రస్తుతం పట్టణాలు, గ్రామాల్లో గ్రామ సింహాలుగా పిలువబడే వీధి కుక్కలు సంచరిస్తూ ఇష్టానుసారం మనుషులపై పడి దాడులు చేస్తున్నాయి. ప్రతి ఏడాది చిత్తకార్తెలో శునకాలు తమ సంతానోత్పత్తిని పెంపొందించుకుంటాయి. సాధారణంగా నగరాలు, పట్టణాల్లో కుక్కలకు సూదిమందు ద్వారా సంతానోత్పత్తిని లేకుండా చేస్తుంటారు. ఫలితంగా శునకాల సంఖ్య పెరగకుండా అరికట్టగలుగుతారు. కొన్ని సందర్భాల్లో పెంపుడు కుక్కలు సైతం అకస్మాత్తుగా మనుషులపై దాడులు చేసి గాయపరుస్తున్నాయి. పొదలకూరు పట్టణంలో కుక్కలు వందల సంఖ్యలో ఉన్నాయి. ఇటీవల పిచ్చికుక్క స్వైర విహారం చేసి వరుసగా దాడులు చేసిన సందర్భాలు ఉన్నాయి. పంచాయతీ సిబ్బంది చొరవ తీసుకుని పిచ్చికుక్కలను నియంత్రించారు. మరలా శునకాల సంఖ్య పెరగడంతో జనాలు బెంబేలెత్తిపోతున్నారు. కుక్కలను పట్టించాలంటే తలనొప్పిగా మారిందంటున్నారు పంచాయతీ పాలకులు. శునకాల ప్రేమికులు కుక్కలను పట్టిస్తే న్యాయపోరాటానికి దిగుతుండడం కూడా సమస్యగా మారిందని పంచాయతీ నిర్వాహకులు అంటున్నారు. స్థానిక సీహెచ్‌సీల్లో కుక్కకాటు మందు(ఏఆర్‌వీ) అందుబాటులో ఉంది. ప్రతినిత్యం ఏదో ఒక గ్రామం నుంచి కుక్కకాటుకు గురైన వారు ఆస్పత్రికి వచ్చి ఏఆర్‌వీ చేయించుకుంటున్నట్టు వైద్యులు వెల్లడిస్తున్నారు.

వీధి కుక్కలతో వేగలేకున్నాం



గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువైంది. ప్రతి గ్రామంలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. రాత్రి వేళల్లో బైక్‌పై వెళ్తున్నా వెంబడిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో పగటిపూట కూడా బైక్‌లను వెంబడిస్తున్నాయి. వీధి కుక్కలు సమూహంగా వెంబడిస్తుండడంతో భయపడుతున్నాం. వీటిని నియంత్రించకపోతే ప్రమాదమే. ప్రభుత్వం వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. గతంలో కుక్కల పునరుత్పత్తి లేకుండా ఇంజెక్షన్ వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ ఇది ఎక్కడా అమలు కావడం లేదు. ఏ గ్రామానికి వెళ్లాలన్నా వీధి కుక్కల భయం వెన్నాడుతోంది. ప్రభుత్వం వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.
– ఎం.మల్లికార్జున, వెంకన్నపురం, కొడవలూరు మండలం

ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు

- గతనెల 23న కోవూరులో ఇంటి ముందు ఆడుకుంటున్న ఆరేళ్ల బాలుడి తల భాగంలో వీధికుక్క కరిచింది. గాయాలపాలైన బాలుడిని కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం నెలూరుకు రెఫర్ చేశారు.
- ఇటీవల కోవూరు వడ్డిపాళెం మార్కెట్ వద్ద చిన్నారిని మూడు కుక్కలు దాడి చేసి కరిచాయి. పక్కనే ఉన్న వారు వాటిని తరమడంతో ప్రాణాపాయం తప్పింది.
- మండలంలోని చెర్లోపాళేనికి చెందిన ఆదూరు రామయ్య అనే వృద్ధుడిపై కుక్కలు దాడి చేసి చెవిని పూర్తిగా కొరికి తీసేసింది. వెంటనే స్థానికులు తరమడంతో ఆయన ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.
- కోవూరు మండల కేంద్రంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దంపతులను వీధికుక్కలు వెంబడించింది. వెనుక కూర్చొన్న మహిళ కాలిని కరిచింది.
- రాళ్లమిట్ట వద్ద స్థానికంగా ఉన్న న్యూలిటిల్ ఫ్లవర్స్ పాఠశాల నుంచి ఓ వృద్ధుడు తన మనుమరాలిని ఇంటికి తీసుకెళ్తుండగా వీధికుక్కలు దాడి చేసింది. ఈ ఘటనలో కుక్కలు వృద్ధుడి చెవిని కొరికి తీవ్రంగా గాయపరిచింది.
- గుమ్మళ్లదిబ్బలో వీధికుక్క స్వైరవిహారం చేసి పలువురిని గాయపరిచింది.
- కోవూరు చెర్లోపాళేనికి చెందిన చిన్నారి దీక్షితపై వీధికుక్కలు దాడి చేసి గాయపరిచింది. వెంటనే కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.
- ఇలా ప్రతిరోజు వీధికుక్కల దాడిలో ప్రజలు గాయాలపాలవుతున్నారు.


కుక్కల దాడిలో గాయపడిన దీక్షిత


కుక్కలు కరవడంతో తెగిపోయిన చెవి

ఇబ్బందిగా మారింది



పట్టణంలో వీధికుక్కలతో వేగలేకున్నాం. పగలు, రాత్రి తేడా లేకుండా ఆరుస్తుండడం వల్ల కొందరు సెంటిమెంటుగా కూడా భయపడుతున్నారు. వీధి కుక్కల స్వైరవిహారం వల్ల రాత్రి వేళల్లో తిరగాలంటే ఇబ్బందిగా మారింది. అధికారులు కుక్కలను పట్టించి ఊరికి దూరంగా పారదోలితే మంచిది. పెంపుడు కుక్కలను యజమానులు వీధిల్లో తిరగనీయకపోవడం మేలు.
– బి.కాళిదాస్, స్థానికుడు, పొదలకూరు

కుక్కల బెడద అధికంగా ఉంది



మా గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉంది. వీధుల్లో తిరగాలంటే భయంగా ఉంది. చిన్నారులకు వెంటాడి కరుస్తున్నాయి. వర్షంలో కుక్కకాటుకు గురైతే మరింత ప్రమాదం. రెండు రోజుల క్రితం కూడా ఓ చిన్నారికి కుక్క కరిచింది. అధికారులు కుక్కల నియంత్రణకు చొరవ చూపాలి.
– నావూరు సిసింద్రి, పడుగుపాడు, కోవూరు

వెంటనే పట్టుకెళ్లాలి



కోవూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో కుక్కల బెడద ఎక్కువుగా ఉంది. పిల్లలు స్కూల్‌కు వెళ్లే సమయాల్లో చాలా భయపడుతున్నారు. మేము పనులకు వెళ్లే సమయాల్లో కూడా వెంట పడుతున్నాయి. కుక్కల నియంత్రణపై అధికారులు శ్రద్ధ పెట్టాలి.
– ఏళ్ల కోటేశ్వరరావు, కోవూరు

బైక్‌ను తరుముతున్నాయి



ప్రతిరోజు కంపెనీకి బైక్‌పై వెళ్లి వస్తుంటాను. అయితే ఈ మధ్య కాలంలో రోడ్లపై కుక్కలు అధిక సంఖ్యలో దర్శనమిస్తున్నాయి. రోజూ డ్యూటీ ముగించుకుని ఇంటికి వచ్చే సమయంలో బైక్ వెంటపడి తరుముతున్నాయి. బైక్‌పై నెమ్మదిగా వెళ్తే కరుస్తాయే అని వేగంగా నడుపాల్సి వస్తోంది. దీనివల్ల కొందరు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే వీధి కుక్కలను పట్టి ప్రమాదాలను అరికట్టాల్సిందిగా కోరుతున్నా.
– సిద్ధార్థ్, ఉద్యోగి, రాచర్లపాడు, విడవలూరు మండలం

చర్యలు తీసుకోవాలి



ఇటీవల ఓ పిచ్చికుక్క మనుబోలు గ్రామంలో తిరుగుతూ పలువురిపై దాడి చేసి గాయపరిచింది. ఆ కుక్క ఇంకెంత మందిని కరుస్తుందో అర్థం కావడం లేదు. ఇంత జరుగుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదు. ఇప్పటికైనా వారు స్పందించి వీధికుక్కల నుంచి ప్రజలను రక్షించేందుకు చర్యలు తీసుకోవాలి.
– ఆలూరు రాము, యాచవరం, మనుబోలు పంచాయతీ

అదుపు చేయాలి



గత కొన్ని రోజులుగా మనుబోలులో వీధి కుక్కలు చెలరేగిపోతున్నాయి. ప్రతివీధిలో కుక్కలు గుంపులుగా తిరుగుతూ జనాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. అధికారులు స్పందించి వీధి కుక్కలను పట్టించి సంరక్షణ కేంద్రాలకు తరలించాలి. లేదంటే వీధి కుక్కలకు రేబిస్ ఇంజెక్షన్‌లు వేయించాలి.
– ముంగర రవీంధర్‌రెడ్డి, మనుబోలు

గొర్రెలనూ వదలడం లేదు



మా గ్రామంలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ప్రతిరోజూ గొర్రెలను పొలాలకు తీసుకెళ్లి మేపుకొని వస్తాను. ఇక్కడ గొర్రెలనూ వదలకుండా వీధికుక్కలు తరుముతున్నాయి. గొర్రెల మందపై అమాంతం పడి చంపేస్తున్నాయి. వీధికుక్కలు వెంబడించిన ప్రతిసారి గొర్రెలు మంద నుంచి విడిపోయి పరుగులు తీస్తున్నాయి. అధికారులు స్పందించి గ్రామాల్లోని కుక్కలను నియంత్రించాలి.
– అరవింద్, గొర్రెల కాపరి, విడవలూరు

భయంగా ఉంది



ముత్తుకూరు పంచాయతీలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వీటి సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. అడ్డూ అదుపు లేని కుక్కల వల్ల పాదచారులు భయాందోళనలకు గురవుతున్నారు. రాత్రి వేళ కునుకు ఉండడం లేదు. భయటకు రావాలంటేనే హడలెత్తిపోతున్నారు. కుక్కల సంతానోత్పత్తిని అదుపు చేయాల్సిన అవసరం ఉంది.
– మేనాటి లక్ష్మమ్మ, వార్డు సభ్యురాలు, ముత్తుకూరు

క్లుప్తంగా

వారాహి అలంకారంలో రాజరాజేశ్వరి అమ్మవారు



నెల్లూరు(బృందావనం): నగరంలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం అమ్మవారు వారాహి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలోని అనివెటి మండపంలో అమ్మవారికి శాకంబరి అలంకారం చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

జైన మత గురువుల 'చాతుర్మాస్ నగర ప్రవేశ్'



నెల్లూరు(బృందావనం): నగరంలో జైన మత గురువుల 'చాతుర్మాస్ నగర్ ప్రవేశ్' కార్యక్రమం శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీజైన్ శ్వేతంబర్ మూర్తి పూజక్ సంఘ్ ఆధ్వర్యంలో ఆచార్య ఉదయప్రభభానురిశ్వర్ శిష్యబృందంలోని ముని ధన్యప్రభ, ముని గోయంప్రభ గురువులు నగర ప్రవేశం చేశారు. ఈ కార్యక్రమం ఆచారివీధిలోని రాజేందర్ టవర్ నుంచి ప్రారంభమై మండపాలవీధిలోని జైన్ ఆలయం వరకు సాగింది. సుమతి శ్రేయస్స్ జైన్ డోల్ బృందం ఆధ్వర్యంలో గురువులకు ఘన స్వాగతం పలికారు. జైన్ ఆరాధన భవన్‌లో కిషోర్‌జైన్ బృందం భక్తిగీతాలను ఆలపించారు.

ఫోర్జరీ సంతకాలపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): నగరపాలక సంస్థ కమిషనర్ సంతకాలను ఫోర్జరీ చేసిన ఘటనలోని నిందితులపై దర్గామిట్ట పోలీసులు శుక్రవారం నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. నెల్లూరు నగరపాలక సంస్థలో కొందరు కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారు. ఈ వ్యహారంలో నగర మేయర్ భర్త జయవర్ధన్, అసిస్టెంట్ శివకృష్ణ, మరికొందరిపై ఆరోపణలు గుప్పుమన్నాయి. తన సంతకాన్ని ఫోర్జరీ చేసిన నిందితులపై చర్యలు తీసుకోవాలని గత కమిషనర్ వికాస్‌మర్మత్ ఈ నెల మొదట్లో అప్పటి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై విచారణ జరిపిన ఉన్నతాధికారులు తాజాగా దర్గామిట్ట పోలీసులను కేసు నమోదు చేయాలని ఆదేశించారు. దీంతో దర్గామిట్ట పోలీసులు ఫోర్జరీ సంతకాల ఘటనపై కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంలోని పాత్రదారుల అరెస్ట్‌కు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ వ్యవహారంలో బాధ్యులంటూ నలుగురు ఉద్యోగులను అప్పటి కమిషనర్ సస్పెండ్ చేసిన విషయం విదితమే.

కోర్టు విధుల బహిష్కరణ

నెల్లూరు(లీగల్): విజయవాడ బార్ అసోసియేషన్ సభ్యులు పప్పుల శ్రీనివాసరావు, పిల్ల సుధాకర్, ఎర్రంశెట్టి పూర్ణమహేష్‌లపై జరిగిన దాడికి నిరసనగా నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం కోర్టు విధులను బహిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమమహేశ్వరరెడ్డి. ప్రధాన కార్యదర్శి సుందరయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం


భక్తులకు సూచనలిస్తున్న డాక్టర్

నెల్లూరు(అర్బన్): నగరంలోని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో బారాషహీద్ దర్గా వద్ద రొట్టెల పండగకు వస్తున్న భక్తుల కోసం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆ ఆస్పత్రి పీఆర్వో చందువర్మ మాట్లాడుతూ భక్తుల కోసం ఈ నెల 17వ తేదీ నుంచి వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రొట్టెల పండగ పూర్తయ్యే వరకు వైద్యశిబిరాన్ని కొనసాగిస్తామన్నారు. కాగా పలువురు భక్తులు ఈ వైద్యశిబిరం వైద్యసేవలు పొందారు.

కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే

నెల్లూరు(సిటీ): నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం వైద్యాధికారులు కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మొగళ్లూరు, సౌత్‌మోపూరు గ్రామాల్లో సర్వే నిర్వహించిన అధికారులు కుష్టు వ్యాధి లక్షణాలు, వ్యాధి ఉన్న వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ నెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు నిర్వహించే ఈ సర్వేలో ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ప్రతి ఇంటికీ వెళ్లి వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించాలని వైద్యాధికారులు సూచించారు. కార్యక్రమంలో వైద్యులు సురేంద్రబాబు, నరసింహులు, ప్రసాద్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్‌ఐ కార్డుల అందజేత


ఈఎస్‌ఐ కార్డులను అందజేస్తున్న కమిషనర్ రమణబాబు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : నగర పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందికి కమిషనర్ రమణబాబు శుక్రవారం ఈఎస్‌ఐ కార్డులు అందజేశారు. నగర పంచాయతీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ ఈఎస్‌ఐ కార్డులను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎలాంటి అనారోగ్య సమస్యలున్నా కార్డు ద్వారా ఉచిత వైద్య సదుపాయాలు పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

'తప్పుడు కేసులు బనాయిస్తున్నారు'

- ఓల్వో డ్రైవర్ల ఆందోళన


మాట్లాడుతున్న ఓల్వో డ్రైవర్లు

ముత్తుకూరు : కృష్ణపట్నం పోర్టులో జరిగిన చిన్న వివాదాన్ని కొండంత చేస్తూ సీఐటీయూ తప్పుడు కేసులు బనాయిస్తోందని పోర్టులో పని చేసే ఓల్వో డ్రైవర్లు ఆందోళన వెలిబుచ్చారు. ముత్తుకూరులో శుక్రవారం వారు విలేకరుల సమావేశంతో మాట్లాడారు. డ్రైవర్ల మధ్య ఇటీవల చిన్న వివాదం ఏర్పడిందని, దీనిని పెద్దది చేసి తాము కొంతమందిపై దాడి చేసినట్టు సృష్టించి తమ ఉద్యోగాలకే ఎసరు పెడుతున్నారని విచారం వెలిబుచ్చారు. తాము యూనియన్‌లో లేమన్న కారణంగా సీఐటీయూ తమపై హత్యాయత్నం కేసులు బనాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సీఐటీయూలో ఉన్నప్పుడు తమకు సన్మానాలు చేశారని, ఇప్పుడు ఆకతాయిలుగా చిత్రీకరిస్తున్నారని మండిపడ్డారు. పోర్టు కార్మికులపై సీఐటీయూ వివక్ష చూపడం మంచిది కాదన్నారు. తమ సమస్యలు ఏమైనా ఉంటే పోర్టు యాజమాన్యం ద్వారా పరిష్కరించుకుంటామని స్పష్టం చేశారు.

సాంకేతికత వైపు అడుగులు వేయాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

కోవూరు : ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతికత వైపు అడుగులు వేయాలని సైకాలజిస్ట్ డాక్టర్ సీహెచ్ రమేష్‌బాబు తెలిపారు. కోవూరు మండలం గంగవరం వద్ద ఉన్న గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థుల ఉన్నత భవితపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తొలుత అతిథులు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో సాంకేతికత ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు సుబ్బారావు, సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లేఅవుట్ ఆర్చి తొలగింపు


లేఅవుట్ ఆర్చిని తొలగిస్తున్న జేసీబీ

పొదలకూరు : పట్టణానికి సమీపంలోని నెల్లూరు మార్గంలో ఉన్న లేఅవుట్ ఆర్చిలను పంచాయతీ అధికారులు శుక్రవారం జేసీబీ యంత్రంతో తొలగించారు. పంచాయతీ అనుమతి లేకుండా లేఅవుట్ నిర్మాణం చేపట్టడంతో పాటు, ఆర్అండ్‌బీ స్థలాన్ని ఆక్రమించి ఆర్చ్ నిర్మించారని అధికారులు వెల్లడించారు. అనుమతుల్లేకుండా లేఅవుట్లు వేసిన వారికి నోటీసులు అందజేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇదిలా ఉండగా మరో లేఅవుట్లో ప్రజాప్రయోజనాలకు కేటాయించిన స్థలాన్ని ప్లాట్లుగా మార్చి విక్రయించారని ఆ స్థలంలో పంచాయతీ హెచ్చరిక బోర్డులను నాటారు.

మూడు దుకాణాల్లో నగదు చోరీ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని మార్కెట్‌వీధిలో మూడు చిరు దుకాణాల్లో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. మూడు దుకాణాల్లో రూ.6 వేలు చోరీ జరిగిందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

సామాజిక సేవపై ప్రత్యేక శ్రద్ధ


కృష్ణపట్నంలో ఆర్వో ప్లాంటును ప్రారంభిస్తున్న ఫౌండేషన్ సీఈఓ

ముత్తుకూరు : సామాజిక సేవా కార్యక్రమాలపై అదానీ ఫౌండేషన్ ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ అభిషేక్ లక్డాకియా అన్నారు. సదరన్ రీజియన్ సీఎస్సార్ హెడ్ డాక్టర్ అనిల్ బాలకృష్ణన్‌తో కలిసి కృష్ణపట్నం గ్రామంలో నూతన ఆర్వో ప్లాంట్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం మత్స్యకార గ్రామాల ప్రజలతో మాట్లాడి, వారికి అవసరమైన సౌకర్యాలపై చర్చించారు. అదానీ ఫౌండేషన్ ద్వారా సరఫరా అయ్యే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మహిళలు చేపట్టిన సెంట్రల్ కిచెన్‌ను ప్రారంభించారు. అదానీ వరల్డ్ స్కూల్‌ను, ముత్తుకూరులో అదానీ విద్యామందిర్, జూనియర్ కళాశాల, ఆర్వో ప్లాంటును పరిశీలించారు. ఆర్అండ్‌ఆర్ కాలనీ వాసులతో సమస్యలపై మాట్లాడారు. నాణ్యత తనిఖీ చేశారు. పోర్టు సీఈఓ జగదీష్ పటేల్, రాజేష్‌రంజన్, జి.వేణుగోపాల్, మృత్యుంజయ్‌రామ్, వెంకటేష్ భాస్కర్ పాల్గొన్నారు.

రేపు దేవాంగ వివాహ పరిచయ వేదిక

నెల్లూరు(బృందావనం): జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి దేవాంగ వధూవరుల వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ మన్నెం సతీష్, పముజుల శంకరయ్య శుక్రవారం తెలిపారు. నగరంలోని పొదలకూరు రోడ్డులో ఉన్న హెచ్ఆర్ కల్యాణ మండపంలో ఉదయం 9 గంటల నుంచి వివాహ పరిచయ వేదిక ప్రారంభమవుతుందని తెలిపారు. జిల్లాలోని దేవాంగ సంఘీయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పిల్లలను బడికి పంపాలి

- కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి


విద్యా కిట్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కొడవలూరు/ విడవలూరు : తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా బడికి పంపాలని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి కోరారు. కొడవలూరు మండలం కొత్తవంగల్లు హైస్కూల్లో, విడవలూరు మండలం అన్నారెడ్డిపాళెంలో విద్యార్థులకు విద్యా కిట్‌లను శుక్రవారం పంపిణీ చేశారు. ప్రభుత్వం పేద విద్యార్థులకు సకల వసతులు కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ క్రమంలో పాఠశాలలో రాత్రిళ్లు మందుబాబులు తిష్ట వేసి రోత పుట్టిస్తున్నారని తల్లిదండ్రులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అలాంటివి పునరావృతం కాకుండా పోలీసులను ఆదేశిస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఎంఈఓలు జి.వసంతకుమారి, ఎస్.అంకయ్య, టీడీపీ నేతలు మదన్, ఎం.శ్రీహరిరెడ్డి, కె.అమరేంద్రరెడ్డి, నారయ్య, రఘురామయ్య పాల్గొన్నారు.

బాలికల హాస్టల్‌కు ఇన్వర్టర్, వాటర్ ప్లాంట్

కోవూరు : స్థానిక బాలికల పాఠశాలలో విద్యా కిట్లను ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలికల వసతి గృహంలో నెలకొన్న సమస్యల గురించి విద్యార్థుల ద్వారా ఆమె తెలుసుకున్నారు. సొంత నిధులతో హాస్టల్‌కు ఇన్వర్టర్, వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేలా సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ రవి, వెంకటేశ్వర్లురెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సాతో షహీద్ దర్గాలో రొట్టెల పండగ


గండవరం దర్గా వద్ద రొట్టెలు వదులుతున్న భక్తులు

- భక్తుల సందడి

కొడవలూరు : మండలంలోని గండవరం సాతో షహీద్ దర్గాలో శుక్రవారం రొట్టెల పండగ సందడి నెలకొంది. మొహర్రం మూడో రోజు ఇక్కడి దర్గాలో రొట్టెల పండగ నిర్వహించడం తెల్సిందే. జిల్లాలోని వివిధ ప్రాంతాల వారితో పాటు ఇతర జిల్లాలు, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు ఇక్కడకు వచ్చి రొట్టెలు వదిలారు. దీంతో దర్గా వద్ద ఉదయం నుంచే సందడి నెలకొంది. నెల్లూరు బారా షహీద్ దర్గాలో రొట్టెలు వదిలిన వారు ఇక్కడి దర్గా వద్ద కూడా రొట్టెలు వదలడం ఆనవాయితీ. దీంతో భక్తులు కొందరు ఇక్కడకు వచ్చి కోర్కెల రొట్టెలు వదిలారు. ఏలూరుకు చెందిన షేక్ అహ్మద్ ఖాజా ఆధ్వర్యంలో దర్గా వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అహ్మద్ ఖాజాను దర్గా కమిటీ సభ్యులు సన్మానించారు. దర్గా కమిటీ చైర్మన్, సెక్రటరీ, కోశాధికారులు షేక్ అబ్దుల్ రషీద్, ఎస్కే సంధాని బాషా, ఎస్కే యస్దానీ దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు.


దాతను సన్మానిస్తున్న దర్గా కమిటీ సభ్యులు

రేపు గురుపూర్ణిమ వేడుకలు

పొదలకూరు : ఈనెల 21వ తేదీన స్థానిక సాయిబాబా మందిరంలో గురుపూర్ణిమ వేడుకలను వైభవంగా నిర్వహిస్తామని బాబా మందిర సేవా సొసైటీ వారు శుక్రవారం తెలిపారు. ఉదయం 5.15 గంటలకు కాగడా హారతితో ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయన్నారు. స్వామివారికి అభిషేకాలు, సామూహిక సాయి వ్రతం, అన్నప్రసాద వినియోగం, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై బాబా కృపకు పాత్రులు కావాల్సిందిగా కోరారు.